

రీసైక్లింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు

యూజ్ అండ్ త్రో ప్లాస్టిక్‌కు స్వస్తి చెప్పి,రీ సైక్లింగ్ ప్రాసెస్ విధానం పై ప్రజలకు అవగాహన కలిగించాలని కలెక్టర్ ఒ. ఆనంద్ అధికారులకు సూచించారు.సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో స్వచ్ఛాంధ్ర గురించి వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రతి మూడో శనివారం ఒకరోజు నిర్వహించే కార్యక్రమం కాదన్నారు. నిరంతరం జరిగే ప్రక్రియ అన్నారు. ఈ ప్రక్రియ జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలో జరిగే విధంగా జిల్లా విద్యాశాఖ అధికారి చర్యలు తీస ుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ ఈ వెంకటరమణ డిపిఒ శ్రీధర్ రెడ్డి ఉన్నారు.

యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం..!

విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం కలలు కని, ఇంజినీరింగ్ పూర్తి చేసి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా, విదేశాలకు వెళ్లి స్థిరపడాలని భావించిన వారి కలలు ప్రశ్నార్థకంగా కనిపిస్తున్నాయి. కనుపర్తిపాడు ప్రియదర్శిని ఇంజినీరింగ్ కాలేజీ నిర్వహణ పూర్తిగా కుంటుపడింది. మొదటి సంవత్సరం కేవలం 11 మంది విద్యార్థులు మాత్రమే అడ్మిషన్ తీసుకున్నట్లు తెలిసింది. రెండు, మూడో సంవత్సర చదువుతోన్న విద్యార్థులు మాత్రమే అక్కడున్నారు. ఇటీవల అధికారులు మెయిన్ బ్రాంచ్‌ను సీజ్ చేశారు. దొడ్డిదారిన అప్పుడప్పుడు తరగతులు నిర్వహిస్తున్నారు. ఫీజులు కట్టించుకున్నా హాల్ టికెట్స్ ఇవ్వకపోవడం, క్లాస్‌లు నిర్వహించకపోవడంతో తమ భవిష్యత్తు ఏమిటో తెలియక విద్యార్థులు ఆందోళనకు దిగారు. సోమవారం 4.20 గంటలకు ప్రారంభమైన ఆందోళన రాత్రి కొనసాగింది. విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద ఎత్తున నినదించారు. పోలీసులు రంగ ప్రవేశం చేశారు.

- ప్రియదర్శిని వద్ద పెద్ద ఎత్తున ఆందోళన
- పోలీసుల మోహరింపు
- 500 మంది విద్యార్థుల ఆవేదన

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు నగరంలోని కనుపర్తిపాడు వద్ద ప్రియదర్శినీ కాలేజీ ఒకప్పుడు ఎంతో మంది విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇచ్చింది. జిల్లాలో మంచి ఇంజినీరింగ్ కాలేజీగా పేరు తెచ్చుకుంది. సంస్థ యజమాని దుర్మణం చెందారు. అప్పటి నుంచి ఇక్కడ కాలేజీ నిర్వహణలో అనేక లోపాలు కనిపిస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి చేరారు. కొద్ది రోజులుగా కాలేజీ రిపిటేషన్ పడిపోతోంది. ఈ ఏడాది మొదటి సంవత్సరంలో కేవలం 11 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నట్లు సమాచారం. ఒక సెక్షన్‌లో కేవలం ఒక్క విద్యార్థి ఉన్నట్లు తెలుస్తోంది. రెండో సంవత్సరం 100 మంది, మూడో సంవత్సరం 280 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిసింది. ఫైనల్ విద్యార్థులు కాలేజీకు రావడం మానేశారు. కాలేజీ హాస్టల్‌లో సుమారు 150 మంది వరకు ఉన్నట్లు సమాచారం. విద్యార్థులు లేకపోవడంతో ఇక్కడ అధ్యాపకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఇటీవల ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలుండడంతో అధికారులు కాలేజీ మెయిన్ బ్లాక్‌ను సీజ్ చేసినట్లు తెలిసింది.ప్రస్తుతం ఉన్న విద్యార్థుల వద్ద ఫీజులు కట్టించుకుంటున్నా వారికి హాల్‌టికెట్స్ సకాలంలో ఇవ్వడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇటీవల జరిగిన నీట్ పరీక్షలకు విద్యార్థులకు చివరి

మీడియాతో మాట్లాడుతున్న విద్యార్థినులు

వరకు హాల్ టికెట్ ఇవ్వలేదు.కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా అక్కడ ప్రస్తుతం ఉన్న యాజమాన్యం లెక్కచేయలేదు. అధ్యాపకులు అతితక్కువ మంది మాత్రమే ఉండడం, సరిగా క్లాస్‌లు నిర్వహించకపోవడం, దొడ్డిదారిలో అప్పుడప్పుడు క్లాస్‌లు నిర్వహించడ, హాస్టల్ నిర్వహణ అంత్యంత లోపభూయిష్టింగా ఉండడంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదేపదే విద్యార్థులు తమ భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించినా పట్టించుకోలేదని తెలిసింది. ఎంతో మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశపడి కాలేజీలో చేరిన విద్యార్థులకు అక్కడి వాతావరణం దెయ్యాల దిబ్బలా తయారైంది. వచ్చే ఏడాదికి కాలేజీలో అడ్మిషన్లు ఉంటాయో లేదో కూడా తెలియని పరిస్థితి. ప్రస్తుతం చదువుతోన్న విద్యార్థులు అక్కడ ఉండలేక, చదువుల లేక, పరీక్షలకు సిద్ధం కాలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఆందోళనకు దిగారు.

కాలేజీ వద్ద విద్యార్థుల భారీ ఆందోళన..!

కనుపర్తిపాడు ప్రియదర్శిని ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు సోమవారం ఆందోళనకు దిగారు.తమకు తరగతులు నిర్వహించడంతోపాటు, కనీస వసతులు కల్పించాలని సాయంత్రం 4.20 గంటలకు ఆందోళనకు దిగారు. విద్యార్థులు పెద్దఎత్తున కాలేజీ వద్ద ఆందోళన నిర్వహించి నినదించారు. రాత్రి పొద్దిపోయే వరకు ఆందోళన కొసాగుతోంది. పోలీసులు వచ్చి విద్యార్థులను బయటపెట్టేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. మీకు అనవసరం, మేనేజ్‌మెంట్ చూసుకుంటుంది వెళ్లండని చెప్పడంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులు అక్కడే చీకట్లో ఆందోళన కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఇక్కడ చదవలేకున్నాం - విద్యార్థులు

మా వద్ద ఫీజులు కట్టించుకుంటున్నారు. ఫైనల్ సంవత్సరం విద్యార్థులు ఇంటికి వెళ్లిపోయారు. కేవలం రెండు, మూడో సంవత్సరం విద్యార్థులు మాత్రమే ఉన్నాయి. ఫీజులు కట్టించుకుటున్నా హాల్ టికెట్స్ ఇవ్వడం లేదు. మాకు అవసరమైన ఫ్యాకల్టీని కాకుండా మేనేజ్‌మెంట్ వివాదస్పద వ్యక్తిని ఇక్కడకు మళ్లీ తీసుకొచ్చింది. దొడ్డిదారిలో వెళ్లి చదువుకోవాల్సి వస్తుంది. మా భవిష్యత్తు ఏమవుతుందోనని భయంగా ఉంది.

మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు కోసం కృషి

ప్రజాశక్తి-నెల్లూరు :దేశవ్యాప్తంగా ఉన్నత మున్సిపాలిటీల ఎంపికలో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఉత్తమ ర్యాంకు సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కమిషనర్ సూర్య తేజ పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు.కమిషనర్ సూర్య తేజ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల

బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

కోవూరు సుగర్ ఫ్యాక్టరీలోని కార్మికులు, ఉద్యోగులకు 2013 జూన్ నెల నుంచి 2022 ఏప్రిల్ నెలాఖరు వరకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కోవూరు సహకార చక్కెర కర్మాగారం కార్మిక, ఉద్యోగులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.సిఐటియు జిల్లా అధ్యక్షులు టి వి వి ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఫ్యాక్టరీలో 400 మంది కార్మికులకు గ్రాడ్యుటీ, ప్రావిడెంట్ ఫండ్, చనిపోయిన వారి ఆలవెన్స్ మొత్తం కలిపి 22 కోట్ల 30 లక్షల 94వేల75 బకాయిలు ఉన్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మూతబడిన ఆరు సుగర్ ఫ్యాక్టరీలకు గాను కేవలం ఒక కోవూరు సుగర్ ఫ్యాక్టరీలు మినహా అన్ని షుగర్ ఫ్యాక్టరీలలో కార్మికులకు, ఉద్యోగులకు బకాయిలు ప్రభుత్వం చెల్లించిందన్నారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయిలు ఎందుకు నిలుపుదల చేశారో అధికారులు ,పాలకులు చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం అసెంబ్లీ సమావేశాలలో కోవూరు సుగర్ ఫ్యాక్టరీ బకాయిలపై ఎంఎల్‌ఎ ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వం దష్టికి తీసుకొని వెళ్లి తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో కార్మికులందరూ ఐక్యమై పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. సిఐటియు సీనియర్ నాయకులు గోని దయాకర్, పి. శ్రీనివాసులు, పి.నారాయణ , సుబ్రహ్మణ్యం, చెంచయ్య, రవి, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న నాయకులు

సర్వేపల్లిలో అవినీతికి అడ్డులేదు ..

వైసిపి నేత కాకాణి విమర్శ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సర్వేపల్లి నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్, ఇరిగేషన్ ఒక్కటేమిటి అన్ని విషయాల్లో అవినీతికి అడ్డా అదుపు లేకుండా పోయిందని వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. సోమావారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు తెలిపారు. సర్వేపల్లిలో వందకోట్ల అవినీతికి ఎంఎల్‌ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెరతీశారని, ఇటీవల మైనింగ్ అక్కడకు వెళ్లిన సమయంలో బయటపడ్డాయన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా విరువూరు రీచ్‌ల నుంచి పెద్ద ఎత్తున ఇసుక తరలిస్తున్నారన్నారు. వాహనాలు పట్టుకున్న అధికారులకు సోమిరెడ్డి, ఆయన అనుచరులు బెదిరించారని వీడియో వివరాలు చూపించారు. రీచ్ నుంచి ఇసుక తీసుకెళ్లడానికి అక్కడ రైతులు వెళ్లే రోడ్లు తెగొట్టారన్నారు. ఇరిగేషన్ కాలువల్లో పూడికలు తీయకుండా బిల్లులు చేసుకున్నారని విమర్శించారు. దీని వల్ల రైతులకు నీరు చేరకుండా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇసుక, మట్టి, గ్రావెల్, బూడిద, బెల్ట్ షాపుల్లో భారీ అవినీతి జరుగు తుందన్నారు. సోమిరెడ్డి అవినీతి గురించి అదికారులుకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, కలెక్టర్. ఎస్‌పి ఉన్నా లేనట్లుగా ఉందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి

మెగా వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-నెల్లూరు :స్థానిక కలెక్టర్ కార్యాలయంలో అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సోమవారం కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్)లో భాగంగా అదానీ ఫౌండేషన్, అదానీ కష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ వారు ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని కలెక్టర్ ఆనంద్ ప్రారంభించారు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శిస్తున్న వందలాదిమంది ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. మెగా ఆరోగ్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారు. సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించిన వైద్యశిబిరంలో ప్రజలు, కలెక్టరేట్ కార్యాలయ ఉద్యోగులు, జర్నలిస్టులకు అపోలో ఆసుపత్రి వైద్యుల బందం వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. కలెక్టరేట్ ఎఒ విజయ్ కుమార్, కార్పొరేట్ వ్యవహారాల అధిపతి కె.ఎం. రామ్, హెచ్ ఆర్ అడ్మిన్ అధిపతి అనురాగ్ ద్వివేది,భద్రత పర్యావరణ విభాగ అధిపతి కౌశల్ సింగ్,డాక్టర్ సుహర్షన్ రెడ్డి, రవీంద్ర, టి.అరుణ్ ,టి , షేక్ షాహుల్ హమీద్ ఉన్నారు.

శివాలయాలకు నిరంతర విద్యుత్

ప్రజాశక్తి-నెల్లూరు :మహాశివరాత్రిని పురస్కరించుకోని జిల్లాలోని అన్ని శివాలయాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ వి.విజయన్ సూచించారు. సోమవారం విద్యుత్ భవన్ లో జిల్లా విద్యుత్ శాఖ సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పలు సూచనలు చేశారు. జిల్లా సూర్యఘర్ నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రూరల్ ఏ. సోమశేఖర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టౌన్ ఎం. శ్రీధర్ ఉన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

శ్మశాన స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి -కందుకూరు :మండలంలోని పరకండపాడు దళితులకు శ్మశాన స్థలం కేటాయించాలని సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినోత్సవంలో సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజకి వినతి పత్రం అందజేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ కోలా కొండయ్య, కే రాము, జి శివ, గారపాటి రామయ్య పాల్గొన్నారు.దళిత కాలనీలో 100 మంది నివాసం ఉంటున్నారని,నేటికీ స్మశానం స్థలము లేక, ఖాళీ ప్రదేశాలను ఉపయో గించుకుంటున్నామని, దీనివల్ల వారు అనేక రకాలుగా ఇబ్బందులకు గురువు తున్నారనిసబ్ కలెక్టర్‌కి వివరించారు. ప్రస్తుతం 160/5లో 13 సెంట్లు స్థలాన్ని ఉపయోగిం చుకుంటున్నారని, దానికి తోడు 160/4లో ఉన్న 42 సెంట్లు స్థలాన్ని కేటాయించాలని కోరారు. దళితులకు వెంటనే శ్మశాన స్థలం కేటాయించాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లాకార్యదర్శి జి వెంకటేశ్వర్లు

కందుకూరు కోర్టు పరిధిని ఒంగోలులో కలపొద్దు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలోని పొన్నలూరు, శింగరాయకొండ, జరుగుమల్లి, కొండపి మండలాలను తొలగించి ఒంగోలు జిల్లా కోర్టుకు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిని నిర్ణయిస్తూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఈనెల14 ఉత్తర్వులు ఇవ్వడాన్ని కందుకూరు న్యాయవాదుల సంఘం అభ్యంతరం తెలిపింది. ఈ మేరకు ఆ సంఘ: అధ్యక్షులు వి.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి పి. సంపత్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయా మండలాలు కందుకూరుకు దగ్గరగా ఉన్నందున ఇక్కడే కొనసాగించాలని కోరారు. లేదంటే ఉద్యమ బాట పడతామని పేర్కొన్నారు.

సుబ్బారావు మృతికి కారకులైనవారిని శిక్షించాలి

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరుకి చెందిన అమ్మనబోయిన సుబ్బారావు మరణానికి కారణం ఎవరు అని ఉమ్మడి ప్రకాశం జిల్లా యాదవ జెఎసి వ్యవస్థాపక అధ్యక్షులు మిరియం శ్రీనివాసులు ప్రశ్నించారు. కందుకూరు పడమర యాదవపాలెంలో సుబ్బారావు మతదేహానికి నివాళులర్పించిన సందర్భంగా అయన ఆవేదన వ్యక్తపరిచారు. పట్టణంలో జోరుగా పేకాట శిబిరాలు నిర్వహిస్తున్న వ్యక్తులపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని, వడ్డీలకు డబ్బులు ఇస్తూ వ్యసనాలకు బానిసలైన బలహీనులను పది రూపాయలు వడ్డీ పేరుతో మోసం చేస్తున్న వ్యక్తుల పైన వ్యవహరించాలన్నారు.సుబ్బారావు మరణానికి కారకుడైన ఏకాంబరం మస్తాన్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. మతుని కుటుంబ సభ్యులను శ్రీనివాసులు పరామర్శించారు.

అర్జీలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఓ ఆనంద్

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలను నిర్దిష్ట గడువులోగా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఆనంద్ తో పాటు జాయింట్ కలెక్టర్ కార్తీక్ ,జడ్పీ సిఇవో విద్యారమ, డ్వామా పీడీ గంగాభవాని, డిపిఒ శ్రీధర్ రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిశీలించి పరిష్క రించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా అర్జీల పరిష్కారం లో అలసత్వానికి తావులేకుండా ,సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపి రీ ఓపెన్ కాకుండా పరిష్కరించాలన్నారు. మొత్తం 456 అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని పునః ప్రారంభించాలి

గత ఐదేళ్లుగా చట్టబద్ధమైన భవన కార్మిక, సంక్షేమ నిధి క్లెయిములు పెండింగ్ లో ఉన్నాయని, సంక్షేమ నిధి డబ్బులు అందక చాలా ఇబ్బందులు పడుతున్నామని, జిల్లాలో ఐదు కోట్ల మేర క్లెయిములు చెల్లించాల్సి వుందని, వెంటనే కార్మికుల సంక్షేమ నిధిని పునరుద్ధరించి తమవు ఆదుకోవాలని కార్మికులు కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఎస్ టి. వర్గీకరణ, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. పి. పెంచలయ్య వినతి పత్రం అంద జేశారు .

ఎస్‌పి కార్యాలయంలో..

స్థానిక ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 80 ఫిర్యాదులు స్వీకరించామని, ఈ ఫిర్యాదులన్నింటిపై విచారణ జరిపి చట్టపరంగా బాధితులకు న్యాయం చేస్తామని ఎస్‌పి జి.కృష్ణకాంత్ తెలిపారు.'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించామన్నారు.జిల్లా అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్ సౌజన్య, మహిళా స్టేషన్ డిఎస్‌పి రామారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న ఎస్‌పి కృష్ణకాంత్

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -నెల్లూరు

జిల్లాలో ఇల్లు లేని పేదలు ఎవరూ ఉండకూడదని, అర్హులందరికీ ఇల్లు మంజూరు చేయడమే లక్ష్యంగా పిఎంఎవై 2.0 డిమాండ్ సర్వేను వేగంగా చేపట్టాలని కలెక్టర్ ఒ. ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాల్లో ఉపాధిహామీ, హౌసింగ్, ఐటీడీఏ, ఆర్డబ్ల్యూఎస్, ఎంఎస్‌ఎంఈ సర్వే, పిఎం సూర్యఘర్ యోజన పథకం అమలు మొదల్కైన అంశాలపై సబ్‌కలెక్టరు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, తహశీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇల్లు లేని పేదలు ఎవరూ ఉండకూడదని లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లను మంజూరు చేస్తున్నామన్నారు. ఈ గొప్ప అవకాశాన్ని నిరుపేదలందరూ వినియో గించుకునేలా అధికారులు కషి చేయాలని సూచించారు. జిల్లాలో ఉపాధిహామీ పనుల వేగం పెంచాలని, ప్రతిరోజూ లక్ష పనిదినాలు లక్ష్యంగా ఎంపిడివోలు, ఎపివోలు ప్రత్యేక దష్టి సారించాలన్నారు. చాలా మండలాలు ఉపాధి పనుల కల్పనలో ఇంకా వెనుకబడి వున్నాయని, ఉపాధిపనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సిసి రోడ్లు, కెటిల్ షెడ్ల నిర్మాణ పనులను ముమ్మరంగా చేపట్టాలన్నారు. ఆధార్ కార్డులు లేని గిరిజనులకు బర్త్ సర్టిఫికెట్లు ఇప్పించి ఆధార్ కార్డులను మంజూరు చేయాలని, ఈ ప్రక్రియ పై ప్రత్యేక దష్టి పెట్టాలని తాసిల్దార్లు ఎంపీడీవోలకు సూచించారు. పిఎం సూర్యఘర్ యోజన పథకంపై పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. రీ సర్వే, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు రీఓపెన్ అవుతున్నాయని, వీటిని రీఓపెన్ కాకుండా సక్రమంగా పరిష్కరించాలని సూచించారు. మ్యూటేషన్లు, పట్టా సబ్ డివిజన్లు, ఆన్‌లైన్ ఎఫ్ లైన్ సర్వే మొదల్కైన రెవెన్యూ దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జెడ్‌పి సిఇఒ విద్యారమ, హౌసింగ్, డ్వామా పిడి లు వేణుగోపాల్, గంగా భవాని, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు విజయన్, వెంకట రమణ, ఐటీడీఏ పీవో మల్లికార్జున్ రెడ్డి, డిపిఒ శ్రీధర్ రెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఒ ఆనంద్

పారదర్శకంగా బిసి కార్పొరేషన్ల రుణాలు

అదనపు కమిషనర్ నందన్

ప్రజాశక్తి -నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రజలకు ఆర్థిక చేయూతనందించే దిశగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో లోన్ల మంజూరు ప్రక్రియను నగరపాలక సంస్థ కార్యాలయంలో అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు అదనపు కమిషనర్ నందన్ తెలిపారు. లోన్ మేళాలో లబ్ధిదారులు తమకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను సంబంధిత మెప్మా విభాగం సిబ్బందికి డివిజన్ల వారీగా అందజేశారు. ధ్రువీకరణ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం సంబంధిత బ్యాంకుల వారికి ఆయా పత్రాలను అందజేయనున్నట్లు అదనపు కమిషనర్ వెల్లడించారు.త్వరలో ఇంటర్వ్యూ తేదీలను తెలియజేస్తామని కమిషనర్ తెలిపారు.

మాట్లాడుతున్న కెవికె హెడ్ జి ప్రసాద్ బాబు

'పిఎం కిసాన్' ప్రత్యక్ష ప్రసారం

ప్రజాశక్తి-కందుకూరు

పట్టణం పరిధిలోని కషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం ప్రధాని .నరేంద్ర మోడి (పియం కిసాన్) పథకంలో భాగంగా 19వ విడత నిధులు రూ. 22,500 కోట్లు ప్రత్యక్ష బదిలీ విధానం ద్వారా సుమారు 9.7 కోట్ల మంది రైతుల ఖాతాలలో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని రైతులకుకెవికెలో ప్రత్యక్ష ప్రసారం చేశారు.ఈ సందర్భంగా కెవికె హెడ్ డా.జి.ప్రసాద్ బాబు మాట్లాడుతూ గత 6 ఏళ్ల నుంచి ఇప్పటివరకు 18 విడతలలో కేంద్ర ప్రభుత్వం 3.4 లక్షల కోట్ల రూపాయలను 10 కోట్ల మంది రైతుల ఖాతాల్లో ఈ పథకం కింద జమ చేసినట్లు తెలిపారు. ఈ పెట్టుబడి సాయాన్ని రైతులు నాణ్యమైన విత్తనాలను, ఎరువులను కొని వాడుకోవడం ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గి దిగుబడులు పెరిగి అధిక నికర ఆధాయాన్ని ఆర్జించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు గట్టమనేని హరిబాబు, ప్రసాద్, శాస్త్రవేత్తలు మాయాంక్, జ్యోతి, వివేక్, శ్రీరంగ, వెంకటేష్, రైతులు, రైతుమహిళకు, ప్రకతి వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని 20వ వార్డు పడమరమంగళపాలెం లో నెలకొని ఉన్న సమస్యల పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ కె అనూషకు సిపిఎం మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నాదెళ్ళ కోటేశ్వరరావు వినతి పత్రం సోమవారం అందజేశారు. 20వ వార్డులో ఉన్న పడమరమంగళ పాలెం ,యానాదిపాలెం లల్లో రక్షిత మంచినీటి పథకం నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని దాంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

కలెక్టరేట్‌లో అర్జీ ఇస్తున్న చేవూరు రైతులు

బిపిసిఎల్‌కు భూములివ్వలేం..

ప్రజాశక్తి- కందుకూరు : గుడ్లూరు మండలం చేవూరు గ్రామ రైతులు సోమవారం ప్రజా విజ్ఞప్తుల వేదికలో కలెక్టర్‌ను కలిశారు. పర్యావరణానికి ఇబ్బంది లేని ఇండో సోలార్‌కు మా వద్ద నుంచి భూములను సేకరించి ఇప్పుడు ఆ భూములను బిపిసిఎల్ కు కేటాయించటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అర్జీ రూపంలో తెలిపారు. కలెక్టర్‌ను కలిసినవారిలో రావూరు రైతులు నక్క శరత్ యాదవ్, ఈ సాయి శంకర్ ,ఎన్ విష్ణు,ఆర్ రామకష్ణ ,డి.సురేష్, కే సునీల్, ఎన్ రాము, పత్రే సుబ్బారాయుడు, నక్క హరినాథ్, యు. సుబ్బారావు, వి. శ్రీను,ఆర్ పాపారావు, ఆర్ చెంచారావు, ఎన్ రమేష్, ఎన్ ఏసురత్నం, సిహెచ్ మోహన్, పి అనీల్, పి రవి, ఎల్ హరిబాబు, జి.పేతురు, వై శ్రీను, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పాశం కొండయ్య ఉన్నారు.

ఎస్‌టి వర్గీకణ చేయాలని ధర్నా

ప్రజాశక్తి-కందుకూరు

యానాదుల సంక్షేమ సంఘం పిలుపు మేరకు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సంక్షేమ సంఘం నాయకులు పాల్గొని ఎస్‌టి వర్గీకరణ యానాదులకు అవసరమని ధర్నా చేశారు. ఐటిడిఎ ద్వారా టు వీలర్ మోటార్ సైకిల్, వలలు, సైకిళ్లు ఇప్పించాలని సబ కలెక్టర్‌ని కోరారు. పట్టణంలో సుమారుగా 450 కుటుంబాలకు పైగా సొంత ఇంటి స్థలం లేనటువంటి యానాదులకు ఇంటి స్థలాలు ఇప్పించాలని సబ్ కలెక్టర్‌ని కోరారు.అనంతరం సబ్ కలెక్టర్‌ను సన్మానించారు. ప్రకాశం జిల్లా అధ్యక్షులు కొమరగిరి మాల్యాద్రి, ఉపాధ్యక్షులు చేవూరి దుర్గా ప్రసాద్,ప్రకాశం జిల్లా మహిళా అధ్యక్షురాలు మల్లవరపు సీత ఉన్నారు.



ధర్నా చేస్తున్న యానాదులు

అర్హులకు ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ పట్టణ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఆత్మకూరు టౌన్ కన్వీనర్ జంగం నాగరాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇస్తామని చెప్పారన్నారు. అదేవిధంగా ఇల్లు కట్టుకునేందుకు రూ.4లక్షలు సహాయం అందజేస్తామని ప్రకటించారని, ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు ఇప్పటి వరకు ఏ ఒక్కరికి కూడా ఇళ్ల స్థలాలు కేటాయించలేదన్నారు. అదేవిధంగా ఇళ్ల స్థలాల దరఖాస్తు కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఇప్పటి వరకు ఆన్‌లైన్ పనిచేయలేదని చెబుతున్నారన్నారు. ఇది కూటమి ప్రభుత్వ వైఫల్యమని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలన్నారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన, విద్యార్థుల పక్షాన పోరాటాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు టి.మాధవరావు, టి.నరసింహులు, ఎ.శ్రీనివాసులు, ఎం.చెంచయ్య, డి.హజరత్తయ్య, ఇ.నాగేంద్ర, డి.వాసు, సయ్యద్ రఫీ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

స్కూల్‌కు ఆర్థికసాయం

ప్రజాశక్తి-ఉదయగిరి : సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వార్షికోత్సవాని ఎంఎల్‌ఏ కాకర్ల సురేష్, మన ఫౌండేషన్ అధినేత టిడిపి రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి అన్నదానానికి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం మన ఫౌండేషన్ టిడిపి నాయకులు మాట్లాడుతూ ఎంఎల్‌ఏ కాకర్ల సురేష్, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. అనంతరం స్కూల్ యాజమాన్యం విద్యార్థులు వారి తల్లిదండ్రులు వారికి అభినందనలు తెలిపారు. మన ఫౌండేషన్ టిడిపి, జనసేన నాయకులు షేక్ గౌజల జానీ, బాబు, మల్లు లక్ష్మయ్య, అల్లూరి అంకయ్య, నాగిళ్ళ రవి, సురేష్ పాల్గొన్నారు.

ఎస్‌టి వర్గీకరణ చేయాలని వినతి

ప్రజాశక్తి-కావలి : ఎస్.టి. వర్గీకరణ చేసి, యానాదులకు న్యాయం చేయాలని, యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం "యానాదుల (గిరిజన) సంక్షేమ సంఘం" ఆధ్వర్యంలో యానాదులు కావలి ఆర్.డి.ఓ. కార్యాలయంలో ఆర్.డి.ఒ. ఎం.సన్నీ వంశీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఛైర్మన్ రాపూరు కృష్ణయ్య మాట్లాడుతూ ఏపిలో గిరిజనుల్లో యానాదులే అత్యధికంగా 10లక్షల మంది జనాభాలో ఉన్నారని తెలిపారు. అయినా అభివృద్ధిలో యానాదులు వెనకబడి ఉన్నారన్నారు. ఎస్.సి. వర్గీకరణ లాగా, ఎస్.టి. వర్గీకరణ చేసి, యానాదులకు విద్యాపరంగా, ఉద్యోగ, రిజర్వేషన్లపరంగా న్యాయం చేయాలని కోరారు. తలపల క్రిష్ణయ్య, ప్రకాశం, మంగ, చల్లంచర్ల కాలుగోలయ్య, రమణయ్య, హరి, రమణమ్మ, చారి, కల్లయ్య, పవన్, సాయి, ప్రసాద్, వేణు, కల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరులోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ విశిష్ట సాఫ్ట్ సర్వీస్ ప్రయివేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో సోమవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. కళాశాలలో ఆఖరి సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు వివిధ విభాగాలలో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపికైన కంపెనీ వారు విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. కంపెనీ హెచ్‌ఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. కళాశాలకు చెందిన వెంకట సుభాష్, అన్వర్, హరీష్, లక్ష్మీవసన్న, మనోజ్ కుమార్‌లు ఎంపికైనట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివకుమార్, టిపిఒ జాస్మిన్, డిపార్ట్‌మెంట్ హెచ్‌ఒడిలు పాల్గొన్నారు.

పాఠశాలలో స్వరస్వతిపూజ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో సోమవారం సరస్వతి పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అతిథులుగా విచ్చేసిన ఆత్మకూరు బిఎస్‌ఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ షకీల, వారి భర్త డాక్టర్ రవీంద్రరెడ్డి పేదమహిళలు కాలినగ్ కాంపౌండ్‌వెల్ బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మమ్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో యాన్యువల్ డే ఘనంగా నిర్వహించారు.

నూతన పెన్షన్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు, వికలాంగులకు, వితంతువులు, వృద్ధులకు కొత్త పెన్షన్ వెంటనే మంజూరు చేయాలని బోగోలు మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు డిమాండ్ చేశారు. బోగోలు మండల వైసిపి ఆధ్వర్యంలో సోమవారం మండల నాయకులు ప్రజావిజ్ఞప్తి దినం సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలో నూతన పెన్షన్ మంజూరుకు తహశీల్దార్ సురేష్ బాబుకు అర్జీ ఇచ్చి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు మేకల సుజాత, జెడ్‌పిటిసి మద్దిబోయిన కీర్తన, ఉపాధ్యక్షులు మద్దిబోయిన సతీష్, సీనియర్ నాయకులు మద్ది అంకయ్య, జిల్లా అధికార ప్రతినిధి మేకల శ్రీనివాసులు, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు కళ్యాణ్ కుమార్, ఎంపిటిసి ఎకె సుందర్ రావ్, ఎకెపి నాయుట్ రసూల్, సూపునేనే శ్రీనివాసులు, తోటపల్లి రాజా, ప్రసాద్, పాపన్న మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలు గిరిజనులకివ్వాలి

ప్రజాశక్తి-అల్లూరు : ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్ రుణాలు గిరిజనులకు అవకాశపోవడం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అల్లూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి గిరిజనుల తహశీల్దార్ లక్ష్మీ నారాయణకు వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి న్యాయం జరిగేవిధంగా చేస్తామని తహశీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి మాట్లాడుతూ జిల్లాలో యానాదుల పరిస్థితి అధ్వాన్నంగా ఎంతో దిగజారిపోయిందని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. యానాది సంఘ జిల్లా అధ్యక్షులు బాపట్ల సత్యవతమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో వడ్డీ వ్యాపారస్తులు ప్రయివేట్ బ్యాంకులు తండా వ్యాపారాల దగ్గర డబ్బులు తీసుకొని గిరిజనులు అధిక ఉప్పులో అల్లాడిపోతుంటే ప్రభుత్వం చూస్తూ ఉండటం అన్యాయమన్నారు. పౌటూరి శ్రీనివాసులు, ఎస్.ఎడు కొండలు, శ్రీనివాసులు, జెడ్డావాసు, కత్తి విజయమ్మ, సౌభాగ్యమ్మ తదితరులున్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పాఠశాల విద్యాశాఖ విభా సంయుక్తంగా నిర్వహించిన వర్డ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఇంగ్లీషు భాషపై క్లస్టర్ లెవల్, మండల లెవల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విభా జిల్లా టీం నిర్వహించిన గూగుల్ మీట్ కాన్ఫరెన్స్ పోటీలలో రాష్ట్రంలో 24 తరగతి విద్యార్థిని కె.హెన్సి అత్యుత్తమ ప్రతిభ చూపి 27న జరిగే జిల్లాస్థాయి రౌండ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని ఎస్‌ఎంసి కమిటీ ఛైర్మన్ కె.లావణ్య, ప్రధానోపాధ్యాయులు కలిశెట్టి రవీంద్రకుమార్, ఉపాధ్యాయులు జీవిసి, గ్రామస్తులు అభినందించారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-ఉదయగిరి : 26న మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా ఉదయగిరి ఆర్‌టిసి డిపో నుండి వివిధ పరిధిలోని శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నుండి సిద్ధేశ్వరంకు -7, బైరవకోనకు -7, కోయలంపాడుకు -3, సీతారాంపురం నుండి సిద్ధేశ్వరం -2 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. భక్తుల దృష్టిలో ఉంచుకొని 10 అదనపు బస్సులను నడిపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

8న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి-కావలి : మార్చి 8వ తేదిన జరిగే జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభ న్యాయవాదులను కోరారు. కావలి అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ హాలులో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి.విక్రమ్ సిన్హా, స్పెషల్ మేజిస్ట్రేట్ వై.వసుమాల, ఎపిపి ముదుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సురేంద్రరెడ్డి, సెక్రటరీ యం.జయ ప్రకాష్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మకర తోరణాలు సమర్పణ



ప్రజాశక్తి-బిట్రగుంట : విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాళెంలో వెలసి ఉన్న శ్రీ జ్ఞాన ప్రసూనాంబ రామలింగేశ్వర స్వామి దేవస్థానం లోని విగ్రహాల స్వామి వారికి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి రూ.25వేలు విలువ చేసే మకర తోరణాలను గోపిశెట్టి ఆదిశేషయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు గోపిశెట్టి వేణుగోపాల్, పద్మావతి, మనవడు గోపిశెట్టి సాయివిరేష్, శ్రావణి ఆలయానికి సోమవారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు బత్తల రవీంద్ర మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

హైలెవెల్ కెనాల్‌కు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-మర్రిపాడు

సోమశిల హైలెవెల్ కెనాల్ పనులు పూర్తి చేసేందుకు ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో అవసరమైన నిధులు కేటాయించాలని సోమవారం స్థానిక సుందరయ్య భవన్‌లో అఖిలపక్ష రైతుసంఘం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రైతుసంఘం జిల్లా అధ్యక్షులు శ్రీరాములు పాల్గొని మాట్లాడుతూ ఫ్లోరిన్, కరువు పీడిత మండలాలైన మర్రిపాడు, ఆత్మకూరు, అనంతసాగరం, ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు, ఎఎస్‌పేట మండలాలకు సాగు నీరందించాలన్నారు. అలాగే పంటలు వేసుకునేందుకు నీటి వసతి కల్పించాలని 2012లో ఆందోళనలు నిర్వహించామని తెలిపారు. ఫలితంగా 2013లో సోమశిల హైలెవెల్ కెనాల్ ద్వారా 90వేల ఎకరాలకు సాగు, తాగునీరు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. తర్వాత సంవత్సరంలో కెనాల్ పనులు మొదలుపెట్టారని, అప్పటికే 13ఏళ్లు అయిందన్నారు. 13యేళ్ళ కాలంలో సగం పనులు జరుగగా తర్వాత ఆగిపోయిందని, కెనాల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1520కోట్లు కేటాయించిందని నిధులు విడుదల సమస్య పెద్దది కాదు కానీ నిధులు సకాలంలో విడుదల చేసి ఉంటే పనులు పూర్తి అయ్యేవన్నారు. కెనాల్ పనులు పూర్తి అయి ఉంటే ఐదేళ్లలో 25 టిఎంసిలు నీళ్లు కరువు మండలాల ప్రజలు వాడుకునే వాళ్లమన్నారు. ఐదేళ్లలో వర్షాలు సమృద్ధిగా పడగా రిజర్వాయర్ పనులు పూర్తయితే చెరువులు జలకళతో ఉండేవన్నారు. పాలకవర్గాలు వెనుకబడిన ప్రాంతాలపై చిన్న చూపు చూస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో రాజకీయ నాయకులు ఇచ్చిన వాగ్దానాల మేరకు బడ్జెట్లో అధిక నిధులు కేటాయించి సాగు, తాగునీరు అందించేందుకు కృషి చేయాలని కోరుతున్నామన్నారు. కెనాల్ పనులు సత్వరమే పూర్తయ్యేందుకు ప్రభుత్వంపై రైతులు ఒత్తిడి తీసుకువచ్చేందుకు మార్చి 2న మర్రిపాడు మండలంలో రైతులతో సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజకీయాలతో నిమిత్తం లేకుండా రైతుల పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య మాట్లాడుతూ ప్రాజెక్ట్ నిర్మాణానికి 2013లో జిఒ వచ్చి నేటికి 12యేళ్లు అయినా రెండు దశల్లో కలిపి 69శాతం పనులు పూర్తయినట్లు డిపిఆర్ రిపోర్టులో చూపించగా రూ.1532.19కోట్లు ఖర్చువుతుందని ఆలస్యం అయ్యే కొద్ది ప్రాజెక్టు ఖర్చు పెరుగుతుందన్నారు. నదులకు ఆనకట్టలు కట్టే ప్రాజెక్టులు అయితే ఆలస్యం కావచ్చు కానీ ఆరు రిజర్వాయర్లు కాలువలు నిర్మించి, సోమశిల ఉత్తర కాలువ ప్రారంభం నుంచి నీటిని పంపు చేసే పథకమన్నారు. ఆ నీటిని పడమటి నాయుడుపల్లి రిజర్వాయరుకు పంపు చేసి అక్కడి నుంచి మిగతా రిజర్వాయర్లకు గ్రావిటీ ద్వారా, లిఫ్ట్‌ద్వారా నీటిసరఫరా జరుగుతుంది గత నాలుగేళ్లు రాయలసీమలో సమృద్ధిగా వర్షాలు పడటంతో సోమశిల కండలేరు ప్రాజెక్టులు నీటితో నిండి, మరో 100 టిఎంసిల నీరు సముద్రం పాలయ్యాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఒక ఏడాది వర్షాలు కురవకపోయినా ఆరు రిజర్వాయర్లలో కొద్దిపాటి నీరున్నా భూగర్భ జలాలు పెరిగి బోర్ల కింద మెట్ట, వాణిజ్య పంటలకు ఆరుతడి పైర్లకు ఎంతో ఉపయోగపడేవన్నారు. మెట్టప్రాంత వాసుల కలలు నెరవేర్చాలంటే కూటమి ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.డి.రహంతుల్లా, సిఐటియు మండల కార్యదర్శి బత్తల రత్నయ్య, రైతు సంఘం నాయకులు గంగినేని తిరుపతి బొల్లాపల్లి సుధాకర్, సీనియర్ నాయకులు మునగాల సూర్యనారాయణ, శాఖ కార్యదర్శులు, సిపిఎం సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరిస్తున్న రైతుసంఘాల నాయకులు

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కావలి : కావలి రూరల్, జలదంకి, బోగోలు మండ లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇప్పించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి, కావలి మండల అధ్యక్షులు పేముల సీతారామయ్య, కె.వి.పి.ఎస్. నాయకులు కె.జాన్‌లు ఆర్‌డిఒను కోరారు. సోమవారం వారు కావలి ఆర్.డి.ఒ. కార్యాలయంలో రైతుల సమస్యలపై ఆర్.డి.ఒ. ఎం.సన్నీవంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ గ్రామాలలో వరికోతలు ప్రారంభమై 15 రోజులు కావస్తుందన్నారు. మిల్లర్లు, దళారులు పుట్టి (865కేజీలు)కి రూ.4500 నుండి రూ.5,000 వరకు తగ్గించి కొంటున్నారని తెలిపారు. తేమ, మట్టిపెళ్లలు ఉన్నాయన్న పేరుతో బస్తాకు 4 నుండి 5 కేజీలు తరుగు తీసుకుంటున్నారన్నారు. ఈ సంవత్సరం వరి దిగుబడి కూడా ఈ సంవత్సరం బాగా తగ్గినదన్నారు. ఎకరాకు 20 నుండి 30 బస్తాలు మాత్రమే అవుతున్నాయన్నారు. కౌలు రైతులు తమ చేతి డబ్బులు వేసి కడుతున్నారని తెలిపారు. ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలు తెరవలేదన్నారు. ఇకనైనా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని వారు కోరారు.

మట్టెంపాడు గ్రామాన్ని కాపాడండి : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు



నెల్లూరు రూరల్ మండలం మట్టెంపాడు గ్రామంలో భూ కబ్జా చేస్తున్న రాచమల్లు రమేష్ చెరనుండి ఆ గ్రామాన్ని కాపాడాలని సోమవారం మండల కమిటీ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు, నెల్లూరు రూరల్ మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధన్ మాట్లాడుతూ గతంలో రూరల్ తహశీల్దారుగా పనిచేసిన ధర్మయ్య మట్టెంపాడు భూములను పరిశీలించి రద్దు చేసిన పట్టాలను తాను 32 ఎకరాలను కొన్నానని చెప్పుకుంటూ ఫేక్ డాక్యుమెంట్లను సృష్టించుకుని వస్తున్నాడని తెలిపారు. గతంలో మెట్ట శేఖర్ రెడ్డికి ఈ భూములకే ఇచ్చిన పాస్ పుస్తకాలను చెల్లవని, అప్పటి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన శ్రీకాంత్ పాస్ పుస్తకాలను అభ్యాయెన్స్‌లో పెట్టినప్పటికీ లెక్కచేయకుండా మట్టెంపాడులో రాచమల్లు.రమేష్ భూకబ్జాలకు పాల్పడుతున్నాడని తెలియజేశారు. గ్రామానికి పోయే 20 అడుగుల వెడల్పు ఉన్న బాటను ఆక్రమించి 20 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ వేస్తున్నాడని, దానిపై సిపిఎం నెల్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ తహశీల్దారుకు రిపోర్టు చేసినా వారి మెతక వైఖరి వల్ల ఆ పనులు ఆపడం లేదన్నారు. కావున అధికారులు ఇప్పటికైనా స్పందించి రాచమల్లు రమేష్‌ను అక్కడి నుంచి ఖాళీ చేయించి అక్కడ సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గుడి రవీంద్ర, ఎన్.వి.రమణయ్య, పలిగల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి సారూ..

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

ఎఎస్‌ట గ్రామ పంచాయతీలో నీటి సమస్యను పరిష్కరించాలని గ్రీవెన్స్‌డే సందర్భంగా సోమవారం పలువురు మహిళలు ఎంపిడిఒ పి.ప్రసన్నకుమారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మహిళలు మాట్లాడుతూ ఎఎస్‌పేటలోని నగరఖాన్ సెంటర్ సమీపంలోని, రెండవ వార్డ్ సమీపంలో తాము నివసిస్తూ ఉన్నామని, తమకు గత కొంతకాలంగా కొళాయిల ద్వారా నీళ్లు సక్రమంగా రాక నరకయాతన అనుభవిస్తున్నామని తెలిపారు. ఇక్కడ ఉండే స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్నికలప్పుడు మాత్రమే కనిపిస్తూ ఉంటామని, తదనంతరం తమ సమస్యలు పట్టించుకునే నాథుడే కరువయ్యారని, ఒక్కొక్క క్యాన్ రూ.15 వంతున కొని ఆ నీటిని వాడుకునే దిగజారే పరిస్థితి తమకు ఏర్పడిందని కన్నీటి పర్యాంతమై ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సచివాలయంలోని పంచాయతీ కార్యదర్శులను అదే విషయంపై ఎన్నోసార్లు మొరపెట్టుకున్నామని కానీ, ఇంతవరకూ సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. ఈ మేరకు ఎంపిడిఒను వివరణ కోరగా, రాబోయే రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఆమె భరోసా కల్పించారు. కార్యక్రమంలో మహిళలు, పాలొన్నారు.

మాట్లాడుతున్న మహిళలు

కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు

ప్రజాశక్తి-కావలి

సిఐటియు రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) పిలుపు మేరకు సోమవారం మున్సిపల్ కార్మికులు కావలి మున్సిపల్ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రికి పోస్ట్‌కార్డు ద్వారా అప్కాస్ రద్దు, ప్రయివేటు ఏజెన్సీ వద్దని, తమను పర్మినెంట్ చేయాలని పోస్ట్ కార్డులు ప్రదర్శిస్తూ ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం గౌరవ అధ్యక్షులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అప్కాస్ రద్దు చేసి మునిసిపల్ కార్మికులను ప్రయివేటు ఏజెన్సీలకి అప్పగించాలని చూడడం ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ కలిపి, అప్కాస్‌లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తద్వారా కార్మికులకు ప్రతినెలా జీతాలు వస్తున్నాయని, గతంలో ప్రయివేటు కాంట్రాక్టులో ఉన్నప్పుడు కార్మికులు జీతాల కోసం నెలల తరబడి ఎదురు చూసేవారని తెలిపారు. పోరాటాలు చేస్తేనే జీతాలు వచ్చేవని, ప్రయివేటు కాంట్రాక్టర్లు కార్మికులను అనేక ఇబ్బందులకు గురి చేసేవారని, బెదిరించేవారని వివరించారు. అప్పుడు కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఇప్పుడు మళ్లీ అదే విధానాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి తీసుకురావడం చాలా ఆశ్చర్యకరమైన విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్కాస్ రద్దు అని అనడంతో ఆందోళనకు గురవుతున్నారని ఇది ప్రభుత్వానికి సరైంది కాదన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తాడని ఆలోచించారని, పర్మినెంట్ చేయకపోగా ఉన్న ఆప్కాస్ విధానాన్నే ఎత్తివేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కార్మికులందరినీ పర్మినెంట్ చేసి, వారి కుటుంబాలలో వెలుగును నింపాలని కోరుతున్నామన్నారు. పర్మినెంట్ చేసేంత వరకూ ఈ పోరాటం దశల వారీగా కొనసాగుతుందని పోరాడి కార్మికులు సాధించుకుంటారని తెలిపారు. కార్యక్రమాలలో సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్, నాయకులు జి.మధుసూదన్ రావు, యూనియన్ నాయకులు తురక సీనయ్య, కె.బాబు, బిడదల మహేష్, క్రాంతికుమార్, జి.శీనయ్య, త్రిమూర్తులు, ఒంగోలు రమేష్, పాముల సీనయ్య, మహిళా నాయకులు రాజ్యలక్ష్మి, జ్యోతి, పరుసు చిన్నమ్మ, అనిత, రాజేశ్వరీ నారాయణమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో..

ఎఐటియుసి ఆధ్వర్యంలో...

ఎఐటియుసి ఆధ్వర్యంలో..

కావలి ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా నాయకులు గత వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అప్కాస్ సంస్థను రద్దు చేయాలని మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయం గేట్ వద్ద ఆందోళనను నిర్వహించారు. రాష్ట్ర మంత్రి వర్గ సమావేంలో అస్కాస్ సంస్థను రద్దు పరచి, ఆ స్థానంలో ప్రయివేటు ఏజెన్సీలను ప్రవేశపెడతామని నిర్ణయించడంతో అస్కాస్‌లో ఉన్న కార్మికులందరిలోని తీవ్ర భయాందోళన నెలకొందన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేసే తిరిగి దళారీ వ్యవస్థ రంగంలోకి వస్తుందన్నారు. ఉద్యోగులకు భద్రత లేకుండా పోయే ప్రమాదం ఏర్పడుతుందని, పొరుగు సేవల కార్మికుల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించి, ఉద్యోగ భద్రత భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించి న్యాయపరమైన డిమాండ్‌లు పరిష్కారించాలన్నారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిస్తామన్నారు. కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లె అంకయ్య, అద్యక్ష, కార్యదర్శి అదినారాయణ, వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు కె.నాగరాజు, దమ్ము దర్గాబాబు, రవిబాబు, కిషోర్, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

బేసిక్ ప్రైమరీ స్కూల్‌గా మార్చాలి

ప్రజాశక్తి-అనంతసాగరం

మండల కేంద్రంలోని ఎస్‌సి కాలనీలోని ప్రాథమిక పాఠశాలను బేసిక్ ప్రైమరీ స్కూల్‌గా మార్చాలని కోరుతూ ఎస్‌సి కాలనీవాసులు, సిపిఎం ఆధ్వర్యంలో ఎంఇఒ ప్రభాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ 117ను రద్దు చేస్తూ హైస్కూల్లో ఉండే 3,4,5 తరగతుల విద్యార్థులను మళ్లీ మోడల్ స్కూల్ లను ఏర్పాటు చేసి అక్కడికి పంపిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో అంతసాగరం ఎస్‌సి కాలనీ స్కూల్లో ఉండే పిల్లలను మోడల్ స్కూల్‌గా మార్చిన ఉర్దూ స్కూల్‌కు పంపిస్తున్నారన్నారు. అనంతసాగరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉండే ఎస్‌సికాలనీ పిల్లలు మోడల్ స్కూల్‌కు వెళ్లడానికి దాదాపుగా ఒకటిన్నర కిలోమీటర్ నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఎస్‌సికాలనీ స్కూల్ నుండి హైస్కూల్లో కలిపిన 3,4,5 తరగతి పిల్లల్లో చాలామంది డ్రాపౌట్స్‌గా ఉన్నారు. ప్రస్తుతం ఎస్‌సి కాలనీ పిల్లలను మోడల్ స్కూల్‌కు వెళ్లడానికి సుముఖంగా లేరని, కావున అనంతసాగరం ఎస్‌సికాలనీ ప్రాథమిక పాఠశాలను బేసిక్ ప్రైమరీ స్కూల్‌గా మార్చి ఒకటి నుండి ఐదు తరగతుల వరకు అక్కడే నిర్వహించాలని కాలనీవాసులు కోరుతున్నారన్నారు. కావున అధికారులు పునరాలోచించి ఎస్‌సి కాలనీ స్కూల్‌ను బేసిక్ ప్రైమరీ స్కూల్‌గా మార్చాలని కోరారు. కార్యక్రమంలో కిరణ్, రాజశేఖర్, బాబు, రాజు, ఎస్‌సి కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మైపాడు టూరిజం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మైపాడు టూరిజం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎపి టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని మైపాడు సముద్ర తీరాన్ని ఆయన సందర్శించారు. జనసేన నాయకుడు గుడి హరికుమార్ రెడ్డితో కలిసి సముద్ర తీరంలో కాసేపు సరదాగా సముద్ర స్నానం చేశారు. అనంతరం సముద్ర తీరాన వెలసి ఉన్న శ్రీ భ్రమరాంబ దేవి సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సివిల్ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నెల్లూరు పర్యటన విజయవంతంగా జరిగిన సందర్భంగా సముద్ర తీరాన సేద తీరడం జరిగిందన్నారు. మంత్రి పర్యటన జనసైనికులు వీర మహిళ కలిసి విజయవంతంగా నిర్వహించారన్నారు. మైపాడు గురించి టూరిజం మంత్రి దృష్టికి తీసుకువెళ్లి మైపాడు టూరిజం అభివృద్ధికి తోడ్పడుతామని తెలియజేశారు. కార్యక్రమంలో నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్, సుందర రామీరెడ్డి, జమీర్, కృష్ణారెడ్డి, మురళీ రెడ్డి, గుండాల మాధవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో క్విజ్‌పోటీలు

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం రెడ్‌క్రాస్ భవనంలో అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జూనియర్ విభాగము నుండి 51మంది విద్యార్థులు, సీనియర్ విభాగానికి సంబంధించి 57 మంది విద్యార్థులు సైన్స్ క్విజ్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఇఒ బండి గోవిందయ్య మాట్లాడుతూ విద్యార్థులలో ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ ఆలోచన విధానాన్ని పెంపొందించుకోవడాని కి, గత నాలుగు రోజులుగా ఈ సైన్సు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు ప్రతి విషయాన్ని శాస్త్రీయ దృక్పథంతో ఆలోచిస్తూ మూఢనమ్మకాలను విడనాడి, భావి సమాజాన్ని ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. ఎస్.రామకృష్ణ, ఆకుల.రమణయ్య, ఎస్.కె జిలానిభాషా, ఎస్.సత్యనారాయణ క్విజ్ మాస్టర్లుగా వ్యవహరించినందుకు వారిని అభినందించారు. కార్యక్రమంలో కావలి పట్టణ జెవివి గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ.రవికుమార్, ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి.హరినాథ్, కోశాధికారి టి.సుబ్బరామశర్మ, ఉపాధ్యక్షులు కందికట్టు.నారాయణ, ఎస్.కె. ఖాదర్ భాషా, సంయుక్త కార్యదర్శి సి.శారద, కె.జాన్, పెన్షనర్స్ అసోసియేషన్ మాజీ సెక్రెటరి మొగల్ సిరాజ్ బేగ్, మండవ.వెంకటరమణయ్య, నాగలక్ష్మి, తదితరులున్నారు.

పోటీలల్లో పాల్గొన్న విద్యార్థులు

ఇన్ఫోసిస్ కంపెనీకి విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఎపి ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ అకాడమీ వారి ఆధ్వర్యంలో నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రాంగణం ఎంపికలలో ఇన్ఫోసిస్ కంపెనీకి ఎంపికైన ఎఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని సిహెచ్.సాయిసౌమ్యకు కళాశాల ప్రాంగణంలో అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ ఎం.సుబ్బారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు ఉన్నతమైన విద్యతో పాటు ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా ప్రాంగణం ఎంపికలను ఏర్పాటు చేస్తూ, ఎంతోమంది విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దుతున్నామని తెలియజేశారు. ఉద్యోగం సాధించిన సిహెచ్.సాయిసౌమ్య మాట్లాడుతూ మన కళాశాలలో యాజమాన్యం వారు ఏర్పాటు చేసిన ప్రాంగణ ఎంపికలను విద్యార్థులందరు ఉపయోగించుకుని ఉద్యోగాలను సాధించాలని తెలిపింది. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది.

అనుమాలశెట్టి వెంకట రమణ రక్షిత్, S/o **శ్రీనివాసులు,** కావలి అనునాకు చెందిన **872/1990 నెం.** గల ఒరిజినల్ డాక్యుమెంట్ **తే.16-01-2025ది.** న కావలిలో SBI Court Center జెరాక్స్ షాప్‌కు పోవుచుండగా పోయినది. దొరికిన వారు నాకు చేర్చగలరు.

ఇట్లు,
అనుమాలశెట్టి వెంకటరమణరక్షిత్,
సెల్: **9959311023**

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఉదయగిరి : విద్యుత్ శాఖ పరిధిలోని రైతులు మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏడిఇ కోటేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం తెలుపుతూ ఉదయగిరి విద్యుత్ శాఖ పరిధిలోని సీతారాంపురం, కుర్రపల్లి, ఉదయగిరి, దుత్తలూరు మండల రైతులు ఈ రెండు గంటల విద్యుత్తు అంతరాయానికి సహకరించాలని కోరారు. సింగల్ ఫేస్ విద్యుత్ సరఫరా యధావిధిగా కొనసాగుతుందన్నారు.

1బి అడంగల్ ఇవ్వడం లేదని వినతి

ప్రజాశక్తి-ఉదయగిరి : గ్రామాలలో చేపట్టిన భూ రీసర్వేతో గతంలో వచ్చిన విధంగా 1- బి, అడంగల్ సర్వే పూర్తయిన తర్వాత నుండి రావడం లేదని దానితో పంటరుణాలు ప్రభుత్వ పథకాలు అందడం లేదని రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్యతో తహశీల్దార్ ఎం.సుభద్రకు కొండకిందపల్లి పంచాయతీ రైతులతో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ గతంలో తమ పూర్వీకుల నుండి భూమి కలదని కాను ఇప్పుడు జరిగినది సర్వేలో ఆ భూములు కొంటలు వాగులు ఇతరుల పేర్లపై వస్తున్నాయని దాంతో రిజిస్ట్రేషన్ చేసుకున్న పూర్తి హక్కుదారులైన రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. మండలంలోని పలు పంచాయతీలో గత ప్రభుత్వం జరిపిన భూ రీసర్వేతో అప్పటి వరకు వస్తున్న 1-బి అడంగల్ తర్వాత నుండి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో బ్యాంకు రుణాలు పంట రుణాలు పొందేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అనేక రెవెన్యూ సదస్సులో ప్రజావిజ్ఞప్తుల దినోత్సవంలో సంబంధిత అధికారులను మొరపెట్టుకున్నామని ఆయన ఫలితం నేటికీ లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అర్హత కలిగిన రైతులందరికీ 1-బి అడంగల్ వచ్చేలా చర్యలు చేపట్టాలని లేకపోతే పంచాయతీ రైతులతో కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

అత్యంత కష్టమైన వృత్తి 'నర్సింగ్' : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కావలి : ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఏదైనా సాధించవచ్చునని, అన్ని వృత్తుల్లో కెల్లా అత్యంత కష్టమైన వృత్తి నర్సింగ్ వృత్తి అని ఎంఎల్ఏ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. ఆదివారం శ్రీసాయి నర్సింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ క్రిష్ణారెడ్డిని కళాశాల డైరెక్టర్ దశరధరామిరెడ్డి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతోటి సన్మానించి, ఘనంగా స్వాగతం పలికారు.

Before The Hon'ble District Consumer Disputes Redressal Commissioner : Nellore

C.C.No. 99 / 2024

Gaddam Raghava Reddy - Complainant
Vs
1. The Manager, PUR Energy Pvt. Ltd., Hyderabad. and another - Opposite Parties

Notice

To,
Opp-2. **The Manager, PUR Energy Private Limited,** Ground Floor, 26-11-933/2, Revenue ward No.26-III, Mini Bypass Road, Opp Mega Mart, Nellore-524004.

పై నెంబరున కంప్లయినెంట్ పై తెలిపిన నెల్లూరు జిల్లా వినియోగ దారుల ఫోరంలో మీపై కంప్లయింట్ దాఖలు చేసియున్నారు. సదరు కంప్లయింట్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే28-02-2025ది**కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన నెల్లూరు జిల్లా వినియోగ దారుల ఫోరంలో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

టి.ముని కుమార్, ఎల్.ఎల్.బి.,
కంప్లయినెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

మహారాజశ్రీ నెల్లూరు 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

I.A.No. 638/2024
A.S.No. 98/2023

సిహెచ్.సులోచన - పిటిషనరు/అప్పిలెంట్
Vs
1. **పొనకా వెంకటశేషారెడ్డి** (Died)
2. **పొనకా పుష్పవేణి,** భర్త లేట్ వెంకటశేషారెడ్డి
3. **పొనకా త్రినాథ్ రెడ్డి,** తండ్రి లేట్ వెంకటశేషారెడ్డి
4. **పొనకా కాసుషితా రెడ్డి,** తండ్రి లేట్ వెంకటశేషారెడ్డి

2 To 4 వారల నివాసం H.No.26-16-328, ప్లాటినవమ్ హైట్స్ అపార్ట్‌మెంట్, దంర్రోఫర్నిచర్‌షాపు దగ్గర, గూడూరు భాస్కర రామిరెడ్డి లే అవుట్, నెల్లూరు సిటీ - రెస్పాండెంట్స్, ప్రపోజ్డ్ పార్టీస్

ఐ.ఏ.నోటీసు

పై నెంబరున పిటిషనరు/ అప్పిలెంట్ పై కోర్టులో మీపై ఐ.ఏ.నెం.638/2024 దాఖలు చేసి 2 To 4 రెస్పాండెంట్స్ / ప్రపోజ్డ్ పార్టీని పై నెంబరు ఎ.ఎస్.నెం. 98/2023 నందు 2 To 4 రెస్పాండెంట్స్‌గా చేర్చమని పై నెంబరు ఐ.ఏ.ను దాఖలు చేసి ఉన్నందున పై కోర్టు వారు పై ఐ.ఏ. నందు మీకు నోటీసు నిమిత్తం **తేది: 05-03-2025** కి వాయిదా వేసియున్నారు. ఆరోజు పగలు **ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ముందు మీరు హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనవలసినది. లేనియెడల పై కోర్టు వారు పై ఐ.ఏ.ను మీకు పరోక్షముగా తీర్మానించెదరు.

కొండూరు శేషారెడ్డి, బి.కాం., బి.ఎల్.,
పిటిషనరు / అప్పిలెంట్ తరపు అడ్వకేట్
నెల్లూరు.

దావా సమను
కావలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. నెం 197/2012

బిట్వీన్:
మహ్మద్ ఫజులుద్దీన్ సాహెబ్ (Died) & his LRs - వాదులు
వర్సెస్
అజీమున్నిసా బేగం (Died) & ఇతరులు - ప్రతివాదులు

To,
1) **పఠాన్ మొయిన్, S/o అస్లాం** (D12),
2) **పఠాన్ ఇర్ఫాన్, S/o అస్లాం** (D13),
ఏ.ఎస్.పేట గ్రామం మరియు మండలం,
SPSR నెల్లూరు జిల్లా. అనువారికి,

పై నెంబరున దావాలో పరిహారం నిమిత్తం మీమీద దావా దాఖలు చేసుకొన్నందున శ్రీ కోర్టు వారు మీకు నోటీసు నిమిత్తం **తే 25-03-2025 ది** కి వాయిదా వేయబడియున్నది. కావున మీరు ఆ రోజు **ఉదయం 10.30 గంటలకు** పై కోర్టులో మీరు గాని, మీ వకీలు ద్వారా గానీ హాజరై మీరు దావా కాపీలననుసరించి సమాధానాలు చెప్పవలసి ఉన్నది. పై దినమున మీరు హాజరు కాకుండా తప్పిన యెడల నీపరోక్షమునందు పై వ్యాజ్యము విమర్శ చేసి, తీర్మానించుట జరుగునని తెలియపరచడమైనది.

షేక్.రహిమాన్ సాహెబ్, M.A., M.L.,
వాదులతరపున్యాయవాది, కావలి.
సెల్ : **9440207015**

అవినీతి మరక అంటించడం దుర్మార్గం

ప్రజాశక్తి-జలదంకి

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పై అవినీతి మరక అంటించడం అత్యంత దుర్మార్గపు చర్య అని మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.సోమవారం జలదంకి లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశాన్ని జలదంకి మండల నాయకులతో కలిసి వేణుగోపాల్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చిన వారిలో ముందు వరుసలో ఉన్నవారు నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి.. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కావలి ఎమ్మెల్యే దగు మాటి కృష్ణారెడ్డి లు అని తెలిపారు. ప్రతిపక్షాల కొంగు చాటున ఉన్న కొన్ని పత్రికలు చానల్స్ యూట్యూబ్ వారు చేస్తున్న కొట్టె నిరాధారమైన అవినీతి ఆరోపణలని ఆయన పేర్కొన్నారు . వైసీపీ నాయకులు గత ఐదు సంవత్సరాలలో మునుపెన్నడూ లేని విధంగా మైనింగ్, మద్యం ,ఇసుక, దందాలను చేసి అదే భ్రమలో బతుకుతూ, అధికారం లేకపోయేసరికి, అధికారంలో ఉన్నవారు కూడా వాళ్ల మాదిరిగానే చేస్తున్నారని కలలు కంటూ వారి కనుసన్నల్లో ఉన్న మీడియా ద్వారా అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అటువంటివారికి తగిన సమయంలో తగిన బుద్ధి చెబుతామని ఆయన ఘాటుగా విమర్శించారు. రాష్ట్ర ప్రజలు వైసీపీ పార్టీ వారికి తగిన బుద్ధి చెప్పిన వారిలో మార్పు రాలేదన్నారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న మేకపాటి రాజగోపాల్ రెడ్డి జీవితంలో ఎమ్మెల్యే కాలేరని జోష్యం చెప్పారు. మీరు మీ కుమారుడు వ్యాపా రాలు చేసుకోవాలే తప్ప రాజకీయా లలో రాణించలేరన్నారు. చిల్లర రాజకీయాలు చేస్తే నియోజకవర్గ ప్రజలు తిప్పి కొడతారని గుర్తించుకోవాలన్నారు. 40 సంవత్సరాలుగా నియోజకవర్గంలో చేసింది ఏమీ లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11 సీట్లకు పరిమితమైన మీరు కొంచెం కూడా ఆలోచన లేకుండా బయటకు రావడం సిగ్గుచేటు అన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలే తప్ప, చిల్లర రాజకీయాలు చేస్తే, ఎక్కువ రోజులు నిలబడలేరని తెలిపారు. వైసీపీ పార్టీ ఇక అధికారంలోకొచ్చే ప్రసక్తే లేదని ఆయన తెలిపారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు కొండంత అండ అని సభ్యత్వాలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా చేసుకుంటారని, ఎవరి మీద నా ఆధార పడవలసిన అవసరం పార్టీకి లేదని, 95 వేల సభ్యత్వాలు నియోజకవర్గంలో చేసి రికార్డు సృష్టించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. అమెరికాలో స్థిరపడిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పుణ్యభూమి మీద మమకారంతో, పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు ఇక్కడికి వచ్చారే తప్ప, మరొకటి కాదన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నాయకత్వంలో నియోజకవర్గం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని, దీనిని ఓర్వలేక పక్కదారి పట్టించేందుకు, మీడియాతో కలిసి ప్రతిపక్ష నాయకులు కుట్ర చేస్తున్నారన్నారు. ఈ కుట్రను ఐక్యంగా టిడిపి నాయకులు కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో యువ నాయకుడు మంత్రి నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని, విదేశాల నుండి విపరీతంగా పెట్టుబడులు వస్తున్నాయని, బిజెపి ప్రభుత్వంలో నిధులు వరదలా వచ్చి పడుతున్నాయని, అనుకున్న దానికంటే రెట్టింపు స్థాయిలో అభివృద్ధి జరుగుతుందని, సంక్షేమ కార్యక్రమాలకు ఎలాంటి డోకా లేదని , జరిగిన ఎనిమిది నెల కాలంలోనే ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశ పెడుతూ టిడిపి ప్రభుత్వం ముందుకు వెళ తుందని మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగో పాల్ రెడ్డి ఘంటపదంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుమోహన్ రెడ్డి సీనియర్ నాయకులు మెదరమెట్ల శేషారెడ్డి, మునగాల తిరుమల రెడ్డి, పొన్నం రోశిరెడ్డి, జిలుమూడి వేణుగోపాల్ రెడ్డి,జిలుమూడి వినయ్ కుమార్ రెడ్డి, పున్నూరు రామకష్టారెడ్డి, తలపనేని మధు నాయుడు, దగుమాటి మాలాద్రి రెడ్డి, వంటేరు నందగోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నిప్పు అంటుకొని పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-కోవూరు :మండలంలోని ఇనమడుగు గ్రామపంచాయతీ జెమ్మిపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి నిప్పు అంటుకుని తాళ్లపాక శ్రీనివాసులకు చెందిన ఓ పూరిల్లు దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది.. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని గ్రామ రెవెన్యూ అధికారి హరి వెళ్లి స్వయంగా పరిశీలించి బాధితులకు స్వాంతన కలిగించారు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉండే బీరువా, టీవీ, ఇతర నగదు వస్తువులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి ఈ మేరకు సమాచారాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకె వెళ్తామని ఈ సందర్భంగా హరి తెలియజేశారు. బాధితులకు తహశీల్దార్ ఆదేశాల మేరకు బియ్యం. చెక్కెరను అందించారు

బైక్ ఢీకొని గొర్రెల కాపరి మృతి

ప్రజాశక్తి-కోవూరు:గొర్రెలు కాచుకుంటూ జీవనం సాగించే ఓ కుటుంబం లో ఆదివారం రాత్రి జరిగిన ఓ రోడ్డు ప్రమాదం ఆ కుటుంబానికి తీరని విషాదం నింపింది.పోలీసుల సమాచారం మేరకు.. కోవూరు మండలం. వేగూరు గ్రామానికి చెందిన గంధళ్ల శీనయ్య(59) గొర్రెల మేపుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి గొర్రెలు తీసుకొని ఇంటికి వస్తున్న సమయంలో మోడేగుంట నుంచి వేగంగా వస్తున్న మోటార్ సైకిల్ శీనయ్యను ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలైన ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని ట్రైనీ డిఎస్పి శివప్రియ, ఎస్ఐ రంగనాథ్ గౌడ్ ప్రమాదం జరిగిన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి-కోవూరు : ప్రభుత్వ పాఠశాల చదివే విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి వారికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా ఇస్తున్న కంటి అద్దాలను వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు నాయుడు తెలిపారు. మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్తమాలిక్ అసిస్టెంట్ లక్ష్మీ ప్రసన్న ఎంతో ఓర్పుతో విద్యార్థులకు ఉచితంగా కంటి,పరీక్షలు నిర్వహించి వారికి కంటి అద్దాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవడంపై ఆమెను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు.

బాధ్యతులు నిర్వహిస్తున్న ట్రైనీ డిఎస్పి శివప్రియ

ట్రైనీ డిఎస్పిగా శివప్రియ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-కోవూరు:కోవూరు పోలీస్ స్టేషన్లో ట్రైనీ డిఎస్పిగా శివప్రియ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలల పాటు ఈ స్టేషన్లో విధులు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆమెను కోవూరు ఎస్ఐ రంగనాథ్ గౌడ్ స్వాగతించారు

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కోవూరు :స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 25వ తేదీ మంగళవారం విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ శ్రీహరి రెడ్డి తెలిపారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువతీ, యువకులు తమకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో తప్పక హాజరు కావాలన్నారు. ఇతర వివరాల కోసం. 90637 44225 అనే నెంబర్, ను సంప్రదించాలన్నారు.

కరాటే పోటీల్లో సత్తాచాటుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ఆ విద్యార్థుల పంచ్ పడిందంటే ప్రత్యర్థులు చిత్తు కావా ల్సిందే. పతకాల పంట పండాల్సిందే. నిరుపేద కుటుంబా లలో పుట్టిన ఆ విద్యార్థులు ఓ పక్క చదువుకుంటూనే మరో పక్క కరాటేలో రాణిస్తున్నారు. ఆర్థిక స్థితి అంతంత మాత్రంగానే ఉన్నా లక్ష్య ఛేదనలో అవేవి అడ్డురావడం లేదు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా సౌత్ ఆ ములూరులోని హనుమాన్ మార్షల్ ఆర్ట్స్ స్పోర్ట్స్ అకా డమీ-సింహపురి మాస్టర్ ఫిఫ్త్ డాన్ బ్లాక్ బెల్ట్ ఇంటర్నే షనల్ గోల్డ్ మెడలిస్ట్ పాశం అశోక్ శిక్షణలో కఠోర సాధన చేస్తున్నారు. ఆ విద్యార్థులు. కష్టాలు దాటుకుంటూ ఆటుపోట్లను అధిగమిస్తూ సాగిపోతున్నారు. "శ్రమిస్తే సాధించలేనిదేది లేదని" ఈ కరాటే యోధులు నిరూపి స్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. జాతీయ స్థాయి కరాటే వేదికలపై సత్తా చాటుతున్న ఈ చిచ్చర పిడు గుల గురించి వివరాల్లోకి వెళితే..నెల్లూరులో ఈ నెల 24వ తేదీన జరిగిన ఫస్ట్ ఎస్కె.ఎ ఫ్.టి నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్-25 పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తమి ళనాడు, పాండిచేరి, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో తోటపల్లిగూడూరు మండలం, సౌత్ ఆము లూరు, తోటపల్లిగూడూరు, నెల్లూరు రూరల్ మండలం, గుడిపాల్లిపాడు గ్రామాలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ సత్తా చాటుకున్నారు. ఈ మేరకు వి.బస్వంత్, ఎం.ముకేశ్, డి.గునిష్క, పి.హేమంత్, పి. జస్వంత్, ఇ. హిమకేష్, ఎస్. కె. సరోష్, నిధి, సిహెచ్ తన్వి శ్రీ, సిహెచ్ భవ్య శ్రీ అత్యుత్తమంగా రాణించి పతకాలు సాధించారు. పతకాలు సాధించిన చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో అత్యున్నత శిఖరాలను అధిరోహించి భరత దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

శ్రీనేతాజీ స్కూల్లో సైన్స్‌ఫేర్

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

శ్రీ నేతాజీ ఎంఎస్ఆర్ పైలెట్ స్కూల్లో వరల్డ్ ఆఫ్ సైన్స్ అండ్ మ్యాథ్స్ ఎక్స్ పో -2025 పేరున సైన్స్ ఫేర్ నిర్వహించారు. ఈ సైన్స్ ఫేర్‌ను విద్యారత్న అవార్డు గ్రహీత నేతాజీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సైన్స్ ఫేర్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎపిఎస్ఆర్‌టిసి నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ముఖ్య అతిథులు మాట్లాడుతూ సుమారు 635 ప్రాజెక్టులను ప్లే క్లాస్ నుండి 9వ తరగతి వరకు చదివే పిల్లలు తయారు చేసి ప్రదర్శించారన్నారు. అందులో ఎక్కువ భాగం సృజనాత్మకమైనవి, వర్కింగ్ మోడల్స్ నేటి తరానికి కావాల్సిన అవసరాలు తీర్చే విధంగా ప్రాజెక్టులు ఉన్నాయన్నారు. నేడు పాఠశాలల్లో చేస్తున్న కార్యక్రమాలలో సైన్స్ ఫెయిర్ అనేది చాలా ముఖ్యమని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థి తాను చదువుకున్న విషయాన్ని నేరుగా ప్రదర్శించడం ద్వారా మరింత విజ్ఞానం పొందుతారన్నారు. ఇందులో విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ వాకాటి విజయకుమార్ రెడ్డి, అపస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్‌వి రమణారెడ్డి, అపస్మా నెల్లూరు జిల్లా కార్యదర్శి సిఎస్ రామ్మోహన్ రెడ్డి, అపస్మా నెల్లూరు జిల్లా ట్రెజరర్ శ్రీ పివి కష్ణారావు, సీనియర్ డైరెక్టర్ కె నరేందర్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ డాక్టర్ సుబ్రా. వేదవతి సుబ్బారెడ్డి, అలేఖ్య, హెడ్మాస్టర్ ఎస్.వి.ఎల్ నరసింహారావు, ప్రిన్సిపల్ శ్రీమతి సుధా పాల్గొన్నారు.

శ్రీజ్వాలాముఖిలో చీరలు వేలం..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మండలంలోని వరిగొండ గ్రామంలో వెలి సియున్న శ్రీ జ్వాలా ముఖి దేవస్థానంలో సోమవారం అమ్మవారి చీరలు, పూజా ద్రవ్యాలు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా అమ్మ వారికి సమర్పించే చీరలకు 30 వేలు, టెంకాయలు, పూజా ద్రవ్యాలకు 40 వే లు లభించినట్లు జ్వాలాముఖి దేవస్థానం అభివృద్ధికి తమ వంతు, సహాయ సహకారాలు అందిస్తున్న భక్తురాలు, కోడూరు రాజేశ్వరి రెడ్డి తెలిపారు. సోమ, శు క్రవారం ఇతర వారాలలో దేవస్థానానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ గా వస్తున్నట్లు తెలిపారు. ఆలయ ఈఓ తాతా శ్రీనివాసులు మాట్లాడుతూ స్థానిక నేత కోడూరు శ్రీనివాసులు రెడ్డి (చిన్న బాబిరెడ్డి) సంపూర్ణ సహకారం భక్తుల తోడ్పడుతూ ఆలయంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎంతో ప్రసిద్ధి చె ందిన శ్రీ జ్వాలాముఖి అమ్మవారిని దర్శించుకోవాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక నేత కర్నూరం శ్రీనివాసులు రెడ్డి, అర్చకులు బొడ్డుపల్లి శ్రీనివాసన్ శర్మ, మోహన్ కృష్ణ, ప్రజలు పాల్గొన్నారు.

సిసి రోడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి-జలదంకి: రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వం వల్లే సాధ్యమవుతుందని అన్నవరం ఎంపీటీసీ సభ్యులు కోర్ని పాటి మహాదేవ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అన్నవరం లోని అరుంధతీ యవాడ, హరిజనవాడ రెండు గ్రామాలను కలిపే సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలుత అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగా సుదీర్ఘకా లంగా రెండు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం గా ఉన్న మార్గాన్ని సిసి రోడ్డు ద్వారా నూతనంగా నిర్మించేందుకు ప్రభుత్వం, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ముందుకు వచ్చారన్నారు. మూడు లక్షల రూపాయల నిధులతో 68 మీటర్ల సిసి రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేవలం ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చినటు వంటి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలపై ప్రతిపక్ష నాయకుల పనిగట్టుకుని అసత్య ఆరోపణలు చేయడం సమంజసం కాదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గోసిపాతలవెంకటకష్ణయ్య, పొజ్జ చినచిన్నయ్య,ధనరాసి మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫేవరెట్ డే వేడుకలు

ప్రజాశక్తి-ఉలవపాడు

శ్రీ సాయి పాఠశాలలో ఫేవరెట్ డే వేడుకలు విద్యార్థులు ఘనంగా నిర్వహిం చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి సభ్యులు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. పాఠశాల కరస్పాండెంట్ కేశవరెడ్డి వెంకట శేషమ్మ, అధ్యక్షతన ఈ కార్యక్రమం లో పలువురు వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్ర మంలో వైసిపి టీచర్స్ ఫెడరేషన్ నాయకులు కేశవరపు జాలి రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ మౌనిక, విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.